# ఆదిలాబాద్ వార్త

మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

బుధవారం 1, జులై 2026




మంచిర్యాల, జూన్ 30, ప్రభాతవార్త

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కార్పొరేషన్ పరిధిలో నడుస్తున్న అనేక హోటళ్ల పనితీరుపై నగరవాసులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు ఆహారం అందించే చోట కనీస పరిశుభ్రత ప్రమాణాలు పాటించకపోవడం, కుళ్లిపోయిన ఆహార పదార్థాలను వినియోగిస్తున్నారన్న ఆరోపణలు రోజురోజుకు పెరుగుతున్నాయి. అయినప్పటికీ సంబంధిత అధికారులు సమగ్రంగా తనిఖీలు నిర్వహించకపోవడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నగరంలోని కొన్ని హోటళ్ల వంటశాలల్లో అపరిశుభ్ర పరిస్థితులు నెలకొన్నాయని స్థానికులు చెబుతున్నారు. పాడైపోయిన కూరగాయలు, పాత నూనె, నిల్వ గడువు ముగిసిన పదార్థాలు వాడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వంట పాత్రలు శుభ్రంగా లేకపోవడం, ఈగలు, దోమలు తిరుగుతున్నా పట్టించుకోకపోవడం ప్రజలను కలవరపెడుతోంది.ఉద్యోగులు, విద్యార్థులు, ప్రయాణికులు ప్రతిరోజూ హోటళ్లపైనే ఆధారపడుతున్నారు.

## హోటళ్లలో శుభ్రత గల్లంతు..

# ప్రజల ప్రాణాలతో చెలగాటమా..!

- ✦ కుళ్లిన ఆహార పదార్థాలు, భద్రతా లోపాలు, అనుమతులపై సందేహాలు
- ✦ ఆరోగ్య శాఖ, అగ్నిమాపక విభాగాల తనిఖీలు ఎక్కడ?



2 లో..

# అక్రమ ఇసుక, మొరం తవ్వకాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

- ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన మైనింగ్ అధికారులు
- స్థలాన్ని పరిశీలించిన అధికారుల బృందం

సిర్పూర్(టి), జూన్ 30, (ప్రభాతవార్త):

సిర్పూర్(టి) మండలంలోని ఆచల్లి గ్రామపంచాయతీ పరిధిలోని పెద్దబండ శివారులో జేసీబీల సహాయంతో అక్రమంగా ఇసుక, మొరం తవ్వకాలు నిర్వహిస్తూ తరలిస్తున్నారంటూ బాధితులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సయ్యద్ కిజర్ హుస్సేన్ మాట్లాడుతూ కొద్దిరోజులుగా భారీ యంత్రాలతో అక్రమంగా మొరం, ఇసుక తవ్వి తరలిస్తున్నారని, ఈ విషయాన్ని పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలిగే విధంగా అక్రమ తవ్వకాలు కొనసాగుతున్నాయని, వెంటనే వాటిని అరికట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్‌కు అందిన ఫిర్యాదుపై స్పందించిన అధికారులు మైనింగ్ శాఖ అధికారులను సంఘటనా స్థలానికి పంపించారు. మంగళవారం మైనింగ్ శాఖ అధికారులు పెద్దబండ శివారులోని తవ్వకాల ప్రాంతాన్ని ప్రత్యక్షంగా పరిశీలించి పరిస్థితిని అంచనా వేశారు. తవ్వకాల వివరాలు, అనుమతులు, అక్రమంగా తవ్వకాలు జరిగాయా లేదా అనే అంశాలపై విచారణ చేపట్టినట్లు తెలిసింది. విచారణ అనంతరం నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు అధికారులు తెలిపారు.మైనింగ్ అధికారుల వెంట సయ్యద్ కిజర్ హుస్సేన్, బొమ్మెన శ్రీనివాస్, చౌదరి తిరుపతి, దుర్గం విక్రమ్ తదితరులు ఉండి అక్రమ తవ్వకాలు జరిగిన ప్రాంతాలను చూపించి వివరాలు అందించారు. విచారణలో వాస్తవాలు తేలిన వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



# మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం చేయూతనిస్తుంది

- రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద

జైపూర్, జూన్ 30, ప్రభాతవార్త

రాష్ట్రంలోని మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం చేయూత ఇస్తుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. మంగళవారం జిల్లాలోని జైపూర్ మండలం గంగిపల్లి గ్రామంలో గ్రామైక్య సంఘ భవనం, ఇందిరమ్మ ఇంటిని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మండల తహసిల్దార్ వనజ రెడ్డి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి సత్యనారాయణ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, ఇతర అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం మహిళా శక్తి పథకం ద్వారా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు చేయూత అందించి ప్రోత్సహిస్తుందని తెలిపారు. గ్రామంలో 15 లక్షల రూపాయల డిఎంఎఫ్‌టి 2022-23 నిధులతో గ్రామైక్య సంఘ భవనం ప్రారంభించడం జరిగిందని తెలిపారు. మహిళల సంక్షేమంలో భాగంగా వివిధ వ్యాపార రంగాలలో మహిళా భాగస్వామ్యాన్ని స్వాగతిస్తూ అవసరమైన రుణ సదుపాయం కల్పించి ప్రోత్సహిస్తుందని, మహిళా సంక్షేమంలో భాగంగా అర్హులైన మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. మహిళను కుటుంబ పెద్దగా గుర్తిస్తూ అనేక సంక్షేమ పథకాలు అమలు మిగతా 2లో..



## హోటళ్లలో శుభ్రత గల్లంతు..

# ప్రజల ప్రాణాలతో చెలగాటమా..?

(మొదటిపేజీ తరువాయి)

అలాంటి పరిస్థితిలో నాసిరకం ఆహారం అందితే ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ప్రధానంగా రానున్న వర్షాకాలం దృష్టిలో పెట్టుకుని ఆహార విషబాధ, కడుపు సంబంధిత వ్యాధులు, అంటువ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని సూచిస్తున్నారు.ఇదివరకు పలు వార్తాపత్రికల్లో రాష్ట్రవ్యాప్తంగా హోటళ్లలో నాసిరకం ఆహారం, కల్తీ పదార్థాలు, అపరిశుభ్ర వంటశాలలపై కథనాలు వెలువడ్డాయి. అనేక చోట్ల ఆకస్మిక తనిఖీలలో కుళ్లిన మాంసం, పాడైన నిల్వ పదార్థాలు స్వాధీనం చేసుకున్న ఘటనలు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో మంచిర్యాలలో పరిస్థితి ఎలా ఉందన్న ప్రశ్న ప్రజల్లో తలెత్తుతోంది.హోటళ్ల నిర్వహణకు సంబంధించి అనేక అనుమతులు తప్పనిసరిగా ఉండాలి. భవన అనుమతి, ఆహార భద్రత అనుమతి, అగ్నిప్రమాద నిరోధక అనుమతి, వ్యర్థాల నిర్వహణకు సంబంధించిన అనుమతులు, పారిశుధ్య ప్రమాణాల అనుసరణ వంటి నిబంధనలు అమల్లో ఉండాలి. అయితే నగరంలోని అన్ని హోటళ్లు ఈ నిబంధనలు పాటిస్తున్నాయా అనే అనుమానం ప్రజల్లో నెలకొంది.పట్టణంలోని కొన్ని అల్పాహార కేంద్రాలు పరిశుభ్రత నియమాలను పూర్తిగా విస్మరించి మురుగు కాలువల పక్కనే ఆహార పదార్థాలను తయారు చేసి విక్రయిస్తున్న ఘటనలు ప్రజల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. కాలువల నుంచి వ్యాపించే దుర్వాసన, ఈగలు, దోమల మధ్య ప్రజలకు ఆహారం అందించడం ఆరోగ్యానికి ప్రమాదకరమని ఇదిలా ఉండగా, మరో సంచలన అంశం వెలుగులోకి వచ్చింది. పైకి వాణిజ్య వంటగ్యాస్ వినియోగిస్తున్నట్లు చూపిస్తూ, లోపల మాత్రం గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లను ఉపయోగిస్తున్నట్లు సమాచారం అందుతోంది. గృహ వినియోగ గ్యాస్‌ను వాణిజ్య అవసరాలకు వినియోగించడం నిబంధనలకు విరుద్ధమని తెలిసినా కొందరు నిర్వాహకులు అధిక లాభాల కోసం అక్రమ మార్గాలను ఆశ్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ విధంగా గృహ వినియోగ గ్యాస్‌ను వ్యాపార అవసరాలకు వినియోగించడం వల్ల ప్రభుత్వానికి ఆదాయ నష్టం కలగడమే కాకుండా భద్రతా సమస్యలు కూడా తలెత్తే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సరైన భద్రతా ప్రమాణాలు లేకుండా గ్యాస్ వినియోగించడం ప్రమాదాలకు దారితీయవచ్చని వారు సూచిస్తున్నారు. గత వారంలో నగరంలోని ఓ ప్రముఖ హోటల్లో అగ్నిప్రమాదం చోటుచేసుకుని లక్షల రూపాయల ఆస్తి నష్టం సంభవించిన ఘటన నగరవాసులను మరింత అప్రమత్తం చేసింది. అగ్ని ప్రమాద సమయంలో అత్యవసర బయటపడే మార్గాలు ఉన్నాయా? మంటలను అదుపు చేసే పరికరాలు పనిచేస్తున్నాయా? సిబ్బందికి శిక్షణ ఉందా? అనే ప్రశ్నలు ఇప్పుడు బహిరంగ చర్చకు వచ్చాయి.

చాలా హోటళ్లలో అగ్నిమాపక పరికరాలు కేవలం పేరుకే ఉన్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్నిచోట్ల అవి గడువు ముగిసినా మార్చడం లేదని తెలుస్తోంది. వంట గదుల్లో వాయు సిలిండర్ల భద్రతా ప్రమాణాలు సక్రమంగా పాటించకపోతే చిన్న నిర్లక్ష్యమే పెద్ద ప్రమాదానికి దారితీయవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆరోగ్య పరిశీలకులు, మున్సిపల్ అధికారులు, అగ్నిమాపక విభాగం సంయుక్తంగా హోటళ్లపై క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉందని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఫిర్యాదులు వచ్చినప్పుడు మాత్రమే స్పందించడం కాకుండా ముందస్తు తనిఖీలు నిర్వహించాలని కోరుతున్నారు.

నిబంధనలు ఉల్లంఘించే హోటళ్లపై భారీ జరిమానాలు విధించడం, అవసరమైతే అనుమతులు రద్దు చేయడం ద్వారా మాత్రమే పరిస్థితి మెరుగుపడుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ప్రజల ఆరోగ్యం, భద్రత కంటే లాభాలకే ప్రాధాన్యం ఇస్తే భవిష్యత్తులో మరింత ప్రమాదకర పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. మంచిర్యాల ప్రజలు ఇప్పుడు అధికారులను ఒకే ప్రశ్న అడుగుతున్నారు ప్రజల ప్రాణ భద్రత, ఆరోగ్య రక్షణ విషయంలో సంబంధిత శాఖలు ఎప్పుడు మేల్కొంటాయి? హోటళ్లలో శుభ్రత, భద్రత, నాణ్యతపై కఠిన చర్యలు ఎప్పుడు తీసుకుంటాయి? ఈ ప్రశ్నలకు సమాధానం కోసం నగరం ఎదురుచూస్తోంది.

# 12వ వేతన కమిటీని తక్షణమే పునరుద్ధరించాలి

- బొగ్గు గనుల కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చొరవ చూపాలి
- హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్







నూతనంగా ఎన్నికైన నాయకులకు శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

**మందమర్రి, జూన్ 30, ప్రభాతవార్త:**

దేశవ్యాప్తంగా బొగ్గు గనులలో పని చేస్తున్నటువంటి కార్మికులకు 12వ వేతన కమిటీని తక్షణమే పునరుద్ధరించాలని దీనికి తెలంగాణ రాష్ట్రం నుండి బొగ్గు గనుల కేంద్రమంత్రిగా ప్రాతినిధ్యం వహిస్తున్న కిషన్ రెడ్డి చొరవ చూపాలని మంగళవారం మందమర్రి లోని హెచ్ఎంఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు రియాజ్ అహ్మద్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11వ వేతన కమిషన్ ఈనెల 30 నుండి ముగించడంతో ఇదివరకే బొగ్గు గనుల మంత్రి నుంచి 12వ వేతన కమిషన్ సిఫార్సు చర్యలు చేపట్టాల్సి ఉండగా కేంద్ర ప్రభుత్వం ఏమి పట్టనట్లు వ్యవహరిస్తుందని తక్షణమే వెజ్ బోర్డ్ యూనియన్ లు అన్ని ఒకటై కార్మికుల కోసం పోరాడవలసిన సమయం ఆసన్నమైందని ఆయన అన్నారు. జులై ఒకటవ తేదీన హెచ్ఎంఎస్ సంఘం తరఫున అన్ని బొగ్గు గనుల వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపాలని పిలుపునిచ్చారు. జులై 20వ తేదీ లోపు యాజమాన్యం మెడికల్ బోర్డును ఏర్పాటు చేయకపోతే టిఆర్ఎస్, హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నర సంవత్సరాల నుండి సుమారు 2000 ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉండగా ఏదో ఒక పేరుతో కాలయాపన చేస్తూ కాలం వెళ్ళదిస్తున్నారు అని విమర్శించారు. బిఆర్ఎస్ నేత హరీష్‌రావు బొగ్గు కుంభకోణం అని లెటర్ రాసి సమస్యలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేశారని అన్నారు. ఇటీవల మొదటి దశలో టిఆర్ఎస్, హెచ్ఎంఎస్ సమక్షంలో బాయ్ బాట కార్యక్రమాన్ని ఎన్ని అడ్డంకులు తలపెట్టిన వాటి అన్నింటిని ఎదుర్కొంటూ విజయవంతంగా ముగించినట్లు తెలిపారు. ఇకనైనా సిఐటియు, ఏఐటియుసి, ఐ ఎన్ టి యు సి సంఘాలు ఏకం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం యూనియన్ సంస్థాగత బలోపేతంలో భాగంగా మందమర్రి ఏరియాకు నూతన నాయకులను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన నాయకులు: ఏరియా బ్రాంచ్ సెక్రటరీగా శ్రీనివాస్ రెడ్డి, ఏరియా చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా నవీన్, ఏరియా జాయింట్ సెక్రటరీలుగా కార్తిక్, హర్షవర్ధన్, ఏరియా ఆర్గనైజింగ్ సెక్రటరీగా క్రాంతి, కాశీపేట-1 అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీగా శ్రావణ్. నూతనంగా ఎన్నికైన నాయకులకు ముఖ్య అతిథి రియాజ్ అహ్మద్ శుభాకాంక్షలు తెలియజేస్తూ, కార్మికుల సమస్యల పరిష్కారంలో అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మందమరి ఏరియా వైస్ ప్రెసిడెంట్ సాజన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ సుదర్శన్, సీనియర్ సెంట్రల్ వైస్, ప్రెసిడెంట్ పార్వతీ రాజిరెడ్డి, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ భువన చంద్ర, ఏరియా నాయకులు నవీన్, కార్తీక్, హరీష్, హర్ష, కాసిపేట 1 ఫిట్ సెక్రటరీ ప్రిత్పాల్ సింగ్. శాంతిఖని లింగాల కిరణ్, విజయ్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం చేయూతనిస్తుంది

(మొదటిపేజీ తరువాయి)

చేయడం జరుగుతుందని, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చడం జరుగుతుందని తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు బ్యాంకు లింకేజీ ద్వారా వడ్డీ లేని రుణ సదుపాయం కల్పించడం జరుగుతుందని, రాష్ట్రంలో 21 వేల కోట్ల రూపాయలు స్వయం సహాయక సంఘాలకు అందించడం జరిగిందని తెలిపారు. రుణ సదుపాయం పొందిన స్వయం సహాయక సంఘాలు సకాలంలో తిరిగి చెల్లించినట్లయితే మరింత రుణం పొందవచ్చని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో విద్య అభ్యసించే విద్యార్థులకు ఏకరూప దుస్తుల తయారీలో స్వయం సహాయక సంఘాల మహిళలను భాగస్వామ్యులను చేస్తూ చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. పెట్రోల్ బంకుల ఏర్పాటు, నిర్వహణకు మహిళా సంఘాలకు అవకాశం కల్పించడం జరిగిందని తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గంలో 3 వేల 500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయబడి వచ్చే నెలాఖరుకు దాదాపు 1 వేయి ఇండ్లు పూర్తి కానున్నాయని, మిగతావి పురోగతిలో ఉన్నాయని తెలిపారు. రేషన్ కార్డుదారులకు చౌక ధరల దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ జిల్లాలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు మంజూరు చేసి నిర్మాణ పనులు చేపట్టడం జరిగిందని, ప్రభుత్వ పాఠశాలలను సకల సదుపాయాలతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని తెలిపారు. వైద్యరంగంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని, ప్రభుత్వ ఆసుపత్రులను ఏర్పాటు చేసి వైద్య సేవలు మరింత వేగవంతం చేయడం జరుగుతుందని తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా 5 లక్షల రూపాయల పరిమితిని 10 లక్షల రూపాయలకు పెంపొందించి వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. వచ్చే నెల నుండి పెన్షన్ అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలను సరిదిద్దుతూ రాష్ట్ర అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను అధికారుల సమన్వయంతో జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, వివిధ వ్యాపారాలలో మహిళల భాగస్వామ్యం కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని, గుడిసెలలో ఉండేవారు, అర్హులైన నిరుపేదలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. జిల్లా కేంద్రంలో ఇందిరా మహిళా శక్తి భవన్ ఏర్పాటు చేయడం జరిగిందని, జిల్లాలోని పలు ప్రాంతాలలో మహిళ భవనాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, మహిళా సంఘాల సమావేశాలు, ఇతర పనులకు వినియోగించుకోవచ్చని తెలిపారు. మహిళల ఆర్థిక స్వావలంబన దిశగా ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని తెలిపారు. అనంతరం విశాఖ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు.

అంతకుముందు జిల్లా కలెక్టర్, మండల తహసిల్దార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో కలిసి గ్రామంలో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పరిశీలించారు. జూలై 24వ తేదీ వరకు ఇంటింటి సర్వే నిర్వహించి ప్రతి అర్హులైన ఓటరుకు ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేసి, పూరించిన తర్వాత సేకరించాలని, ఫారాల పంపిణీ ప్రక్రియను జూలై 1వ తేదీ నాటికి పూర్తి చేసి ప్రతి రోజూ పురోగతి నివేదికలను సమర్పించాలని తెలిపారు. ప్రతి బూత్ స్థాయి అధికారి తమ పరిధిలోని ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో ధృవీకరించి, ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు ఒకే పోలింగ్ కేంద్రంలో నమోదై ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటరుగా నమోదు కావడం చట్టరీత్యా శిక్షార్హమని ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు బి.ఎల్.ఓ. యాప్‌ను తప్పనిసరిగా వినియోగించాలని, ఎన్యూమరేషన్ ఫారాలు సేకరించిన అనంతరం ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ప్రక్రియ పూర్తి అయిన స్టిక్కర్‌ను ప్రతి ఇంటికి అతికించాలని, ఫారాల పూరణ, సమర్పణపై ప్రజల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పోచమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్న బోథ్ ఎమ్మెల్యే

నేరడిగొండ, జూన్ 30, ప్రభాతవార్త:

ఆధ్యాత్మిక మార్గంలోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. నేరడిగొండ మండలంలోని రోడ్డు లఖంపూర్ గ్రామంలో నిర్వహించిన శ్రీ పోచమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు సాంప్రదాయబద్ధంగా ఘన స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామాలు ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలతో వర్ధిల్లాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంగాధర్, మండల కన్వీనర్ శివారెడ్డి, మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, మాజీ జడ్పీటీసీ పండరీ, నేరడిగొండ సర్పంచ్ రవీందర్ రెడ్డి, ఉపసర్పంచ్ గులాబ్, మాజీ ఉప సర్పంచ్ దేవేందర్ రెడ్డి, సర్పంచ్ విజయ్, నాయకులు అనిల్ యాదవ్, సాబ్లే సంతోష్, సుజీల్ జాదవ్, ముత్యం, పెద్ద సంఖ్యలో భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



శ్రీ పోచమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవంలో పాల్గొన్న బోథ్ ఎమ్మెల్యే

### సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేసిన బోథ్ ఎమ్మెల్యే

నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో భరోసానిస్తుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. నేరడిగొండ మండల కేంద్రానికి చెందిన సాబ్లే కృష్ణబాయికి రూ.16,500, ఇస్పూర్ గ్రామానికి చెందిన జాదవ్ ఆనంద్ రావుకు రూ.14,000, జాదవ్ సునీత బాయికి రూ.8,500 విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంగళవారం ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనారోగ్యంతో ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకుని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం ఈ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందించి ఆదుకుంటుందని చెప్పారు. నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నేరడిగొండ సర్పంచ్ నీలిమ రవీందర్ రెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ నానక్ సింగ్, సుజీల్, దీపక్, ధీరజ్, రవి తదితరులు పాల్గొన్నారు.

### ఎంపీడీఓ పదవీ విరమణ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే..

నేరడిగొండ మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) సుముఖం శేఖర్ పదవీ విరమణ పొందుతున్న సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలోని సూర్య గార్డెన్‌లో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరయ్యారు. పదవీ విరమణ పొందుతున్న ఎంపీడీఓ శేఖర్‌ను శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ.. ఎంపీడీఓగా శేఖర్ మండల అభివృద్ధికి ఎంతో కృషి చేయడం అభినందనీయమన్నారు. ఇన్నాళ్లూ ప్రభుత్వ ఉద్యోగిగా మండల ప్రజలకు నిరంతరం సేవలందించిన ఆయన, ఇకపై తన కుటుంబ సభ్యులతో కలిసి ప్రశాంతమైన శేష జీవితాన్ని గడపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నీలిమ రవీందర్ రెడ్డి, ఉప సర్పంచ్ గులాబ్, మండల కన్వీనర్ శివారెడ్డి, మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, మాజీ జడ్పీటీసీ పండరీ, మాజీ పీఏసీఎస్ చైర్మన్ నానక్ సింగ్, మాజీ ఉపసర్పంచ్ దేవేందర్ రెడ్డి, సర్పంచులు గంగాధర్, మహేందర్ రెడ్డి, మహేందర్, శ్రీకాంత్, చంపేత్, విజయ్, వెంకట్రాం, అమృత్, రాజేందర్, వినేష్, నాయకులు సాబ్లే సంతోష్, రాథోడ్ సురేందర్, సుజీల్ తదితరులు పాల్గొన్నారు.





## కౌట్ల (బి) గ్రామంలో తనిఖీలు చేసిన ఎంపీఓ అజీజ్ ఖాన్

సారంగాపూర్, జూన్ 30, ప్రభాతవార్త:

మండలంలోని కౌట్ల (బి) గ్రామంలో మంగళవారం ఎంపీఓ అజీజ్ ఖాన్ పర్యటించి పలు తనిఖీలు చేశారు. మొదట గ్రామ సచివాలయాన్ని సందర్శించి అక్కడి రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం, నర్సరీ, పాఠశాల, పల్లె ప్రగతిలో భాగంగా చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీఓ అజీజ్ ఖాన్ స్వయంగా విద్యార్థులతో మాట్లాడి అంగన్వాడీ, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం సరిగా అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో పారిశుద్ధ్య పనులను పరిశీలించి, చెత్త సేకరణ, తడి, పొడి చెత్తను వేరువేరుగా చేస్తున్నారా అని అడిగారు. పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయులు సరిగా బోధిస్తున్నారా అని విద్యార్థుల నుండి సమాధానాలను రాబట్టారు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం అవుతున్నందున వంటలు చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు వహించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బల్మూరి అజయ్, ఉపసర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి శివరత్నం తదితరులు పాల్గొన్నారు.



## ముమ్మరంగా సీసీ రోడ్డు నిర్మాణ పనులు

### - సర్పంచ్ పెండిపెల్లి శీను

భైంసా, జూన్ 30, ప్రభాతవార్త:

భైంసా మండల పరిధిలోని పెండిపెల్లి గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంఎన్ఆర్జీఎస్) నిధుల ద్వారా రూ.18 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్ పెండిపెల్లి శీను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. గ్రామంలో సీసీ రోడ్లు నిర్మించడం వల్ల వీధుల రూపురేఖలు మారిపోతున్నాయని ఆనందం వ్యక్తం చేశారు. గతంలో గ్రామంలోని అంతర్గత రహదారులు ఎంతో అస్తవ్యస్తంగా ఉండేవని గుర్తుచేశారు. ముఖ్యంగా వర్షాకాలం వస్తే వీధులన్నీ బురదమయంగా మారిపోయి, రైతులు తమ ఇళ్లకు ఎరువులు, విత్తనాలు తెచ్చుకోవాలన్నా ఎన్నో అవస్థలు పడేవారన్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు సైతం ఆ బురదలోనే నడుచుకుంటూ వెళ్లాల్సి వచ్చేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు కొత్తగా నిర్మిస్తున్న సీసీ రోడ్డుతో ఆ ఇబ్బందులన్నీ తొలగిపోతాయని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు, నాయకులు, పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

ఆసిఫాబాద్ టౌన్, జూన్ 30, ప్రభాతవార్త :

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన చెక్కులను మంగళవారం ఆసిఫాబాద్ శాసన సభ్యురాలు కోవ లక్ష్మి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఆసిఫాబాద్ నియోజకవర్గానికి చెందిన వివిధ అనారోగ్య కారణాలతో ఆసుపత్రుల్లో చికిత్స పొందిన పేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజలు అనారోగ్యం బారిన పడినప్పుడు ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సాయం అందిస్తోందని తెలిపారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో లక్షల రూపాయలు ఖర్చు చేసి చికిత్స పొందిన నిరుపేద కుటుంబాలకు ఈ సహాయం ఎంతో ఊరటనిస్తుందని పేర్కొన్నారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో ఇప్పటివరకు వేలాది మందికి సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందించామని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన 15 రోజులలోపు దరఖాస్తు చేసుకుంటే త్వరగా మంజూరయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు. అలాగే దళారులను నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మెంగ్రే ఆకాష్, వైస్ చైర్మన్ అహ్మద్, కౌన్సిలర్లు చిలువేరి వెంకన్న, బాలకృష్ణ, సలాం, రవీందర్, లక్ష్మణ్, స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



## అంతాపూర్ గ్రామంలో కాసో నిర్వహణ

### గుడుంబా, దేశీ మద్యం స్వాధీనం వాంకిడి సీఐ వేణుగోపాల్

కెరమెరి, జూన్ 30, ప్రభాతవార్త:

మండలం అంతాపూర్ గ్రామంలో కాసో నిర్వహణ,గుడుంబా, దేశీ మద్యం స్వాధీనం చేసినట్లు వాంకిడి సీఐ వేణుగోపాల్ తెలిపారు. మంగళవారం కెరమెరి ఎస్సై సుధాకర్, పోలీసు సిబ్బందితో కలిసి మండలంలోని అంతాపూర్ గ్రామంలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ కాసో నిర్వహించరు.గ్రామంలో తనిఖీలు నిర్వహించగా, అక్రమంగా నిల్వ ఉంచిన 10 లీటర్ల గుడుంబా, 90 మి.లీ. సామర్థ్యం గల 29 దేశీ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే, గుడుంబా తయారీకి సిద్ధంగా ఉంచిన 50 లీటర్ల బెల్లం పులుసు జగ్గరీ వాష్ను ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు.అనంతరం వాంకిడి సీఐ వేణుగోపాల్ గ్రామస్తులతో సమావేశమై రహదారి భద్రతా నిబంధనలు, నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం, అత్యవసర పరిస్థితుల్లో డయల్100కు సమాచారం అందించాలని అవగాహన కల్పించినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు.అక్రమ మద్యం నిల్వ, తయారీకి సంబంధించి కేసులు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.



## ఉపాధ్యాయులు కిషోర్‌కుమార్‌కు ఎంపీడీఓ సన్మానం

నేరడిగొండ, జూన్ 30, ప్రభాతవార్త:

నేరడిగొండ మండలంలోని తేజపూర్ గ్రామ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల తాగునీటి కష్టాలను తీర్చిన ఉపాధ్యాయులు కిషోర్ కుమార్‌ను మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) శాలువాతో ఘనంగా సన్మానించారు. పాఠశాలలోని విద్యార్థులు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతుండటాన్ని గమనించిన ఉపాధ్యాయులు కిషోర్ కుమార్, తన సొంత ఖర్చుతో పాఠశాలలో ఒక ఆర్ఓ ప్లాంట్‌ను ఏర్పాటు చేయించారు. ఆయన చేసిన ఈ ఉదారమైన సేవను గుర్తించిన ఎంపీడీఓ, మంగళవారం ఆయనను ప్రత్యేకంగా అభినందించి సన్మానం చేశారు. ఉపాధ్యాయుడి సేవా దృక్పథం అందరికీ ఆదర్శనీయమని ఈ సందర్భంగా ఎంపీడీఓ కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



### పోలీసు అధికారులు విధుల పట్ల అంకితభావంతో

# పనిచేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలి

**- డిజిటల్ వ్యవస్థల ద్వారా దర్యాప్తు వేగవంతం చేయాలి : మంచిర్యాల జోన్ డీసీపీ ఏ.భాస్కర్**

**- మంచిర్యాల రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన డీసీపీ**

**నస్పూర్, జూన్ 30, ప్రభాతవార్త**

పోలీసు అధికారులు, సిబ్బంది విధుల పట్ల అంకితభావంతో పనిచేస్తూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని మంచిర్యాల జోన్ డీసీపీ ఏ.భాస్కర్ సూచించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని మంగళవారం ఆయన వార్షిక తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. సర్కిల్ పరిధిలో రోజువారీగా నమోదవుతున్న ఫిర్యాదులు, పెండింగ్ కేసుల స్థితిగతులు, నిందితుల అరెస్టులు, దర్యాప్తు పురోగతికి సంబంధించిన ఫైళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. పెండింగ్‌లో ఉన్న కేసులు, వాటి దర్యాప్తు వివరాలను సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రవీందర్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మరింత నాణ్యమైన, పారదర్శకమైన సేవలు అందించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. సీసీటీఎన్ఎస్, ఈసాక్ష్య వంటి డిజిటల్ వ్యవస్థల ద్వారా కేసులకు సంబంధించిన సాక్ష్యాధారాలను శాస్త్రీయంగా నమోదు చేసి దర్యాప్తును వేగవంతం చేయాలని డీసీపీ ఏ.భాస్కర్ సూచించారు. పోలీసు సిబ్బంది హెచ్ఆర్ఎంఎస్ ద్వారా అందుబాటులో ఉన్న సేవలను సమర్థంగా వినియోగించుకోవాలని చెప్పారు. పిటిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై నిర్ణీత గడువులోగా విచారణ పూర్తి చేసి సత్వర పరిష్కారం అందేలా నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలన్నారు. ప్రజల పట్ల బాధ్యతాయుతంగా, జవాబుదారీతనంతో వ్యవహరిస్తూ ప్రతి ఫిర్యాదును సకాలంలో పరిష్కరించాలని స్పష్టం చేశారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారునికి భద్రత, భరోసా కల్పించే విధంగా పోలీసు వ్యవస్థ పనిచేయాలని డీసీపీ ఏ.భాస్కర్ పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించడం ద్వారా సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని తెలిపారు. మంచిర్యాల రూరల్ సర్కిల్ మొత్తం పనితీరు సంతృప్తికరంగా ఉందని అభినందిస్తూ, ఇదే సేవాస్ఫూర్తితో మరింత సమర్థవంతంగా విధులు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల రూరల్ సీఐ గోపతి రవీందర్, సీసీసీ నస్పూర్ ఎస్సై ఎం. ప్రశాంత్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



కేసుల రికార్డులను పరిశీలిస్తున్న జోన్ డీసీపీ ఏ.భాస్కర్



## ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించడమే ఎస్.ఐ.ఆర్ లక్ష్యం

**తాండూర్, జూన్ 30, ప్రభాతవార్త**

భారతదేశంలోని అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు కల్పించడమే ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్.ఐ.ఆర్) కార్యక్రమం ప్రధాన లక్ష్యమని బిజెపి మంచిర్యాల జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు పులగం తిరుపతి, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. తాండూర్ మండలంలోని123 పోలింగ్ బూత్ పరిధిలో మంగళవారం బిజెపి నాయకులు సామాన్య ప్రజలకు ఎస్.ఐ.ఆర్.పైఅవగాహన కల్పించారు. అనంతరం సర్ ఫారాలను నింపి ఇచ్చారు. వారు మాట్లాడుతూ కాంగ్రెస్, బిఆర్ఎస్, ఇతర రాజకీయ పార్టీల నాయకులు తమ స్వార్థ రాజకీయ లబ్ధి కోసం ఎస్.ఐ.ఆర్ పై అనవసరమైన రాద్ధాంతం చేస్తున్నారని ఆరోపించారు. సర్ ప్రక్రియను భారత ఎన్నికల కమిషన్ ఎంతో పకడ్బందీగా నిర్వహిస్తోందన్నారు. సర్ పై ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవద్దని వారు సూచించారు. సర్ ప్రక్రియకు అందరు సహకరించాలని వారు కోరారు. కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు దూడపాక భరత్ కుమార్, ప్రధాన కార్యదర్శి పుట్ట కుమార్, మండల సోషల్ మీడియా కన్వీనర్ కామెర మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

**- కేజీబీవీని తనిఖీ చేసిన అదనపు కలెక్టర్**

**తాండూర్, జూన్ 30, ప్రభాతవార్త :**



కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని మంచాల జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేజీబీవీ పరిసరాలు, వంటశాల, విద్యార్థులకు అందిస్తున్న ఆహారం, అభివృద్ధి పనులను పరిశీలించారు. కేజీబీవీలోని విద్యా బోధన, మౌలిక వసతులు, భోజనం గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రణాళిక బద్ధంగా విద్యాబోధన చేయాలని సూచించారు. పాఠశాల అభివృద్ధికి సంబంధించిన పలు సూచనలు చేశారు. అదేవిధంగా మండలంలో నిర్వహిస్తున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను అదనపు కలెక్టర్ పరిశీలించారు. ఆయన వెంట తహసిల్దార్ జ్యోత్స్న, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈఓ శ్రీనివాస్, ఎంపీ ఓ శ్రీనివాస్, కేజీబీవి ఎస్ఓ కవిత ఉన్నారు.

## నీట్ పేపర్ లీకేజీపై కెరమెరి మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా

**కెరమెరి, జూన్ 30, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలో నీట్ పరీక్ష పేపర్ లీకేజీ ఘటనను నిరసిస్తూ జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు శివరాం నాయక్ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతోందని నాయకులు తీవ్రంగా విమర్శించారు. నీట్ పేపర్ లీకేజీ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా పోటీ పరీక్షల నిర్వహణలో పారదర్శకత లోపించిందని, విద్యార్థులు వారి తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన నెలకొందని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మునీర్ అహ్మద్, కెరమెరి మాజీ సర్పంచ్ ఉత్తం నాయక్, నాయకులు అబ్దుల్ రజాక్ కెరమెరి ఉపసర్పంచ్ వాగ్మారే శ్రీకాంత్, గోయగాం ఉపసర్పంచ్ రాందాస్, కెరమెరి మండల యువజన కాంగ్రెస్ ఇంచార్జి కొట్రంగే శ్రీనివాస్. మచ్చర్ల మారుతి ముజ్జు పెందూర్ వినేష్ తదితర కాంగ్రెస్ నాయకులు, యువజన కార్యకర్తలు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.





## ఘనంగా ఉద్యోగ విరమణ మహోత్సవం

**బజార్‌హత్నూర్, జూన్ 30, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దాదాపు 28 సంవత్సరాల పాటు విద్యాసేవలందించిన ఉపాధ్యాయులు రామగిరి దామోదర్ మంగళవారం ఉద్యోగ విరమణ చేశారు. స్థానిక తిరుమల గార్డెన్‌లో ప్రధానోపాధ్యాయులు జే భీమన్న అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఉద్యోగ విరమణ మహోత్సవానికి పీఆర్‌టీయూ ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి కృష్ణ కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, సర్పంచ్ పరచ సాయన్న హాజరయ్యారు. ఈ సందర్భంగా మల్లెపూల నర్సయ్య మాట్లాడుతూ.. ఎంతో మంది విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపి, జ్ఞానాన్ని పంచుతూ సమాజానికి ఆదర్శవంతులను చేయడంలో దామోదర్ కృషి ఎనలేనిదన్నారు. ఒక ఉపాధ్యాయుడి బోధనలు కేవలం తరగతి గదికే పరిమితం కాకుండా తరతరాలకూ ప్రభావం చూపుతాయని, ఆయన అందించిన జ్ఞానం, నేర్పిన క్రమశిక్షణ ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని కొనియాడారు. సర్పంచ్ సాయన్న మాట్లాడుతూ.. సుదీర్ఘ సర్వీసులో ఆయన కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా, విద్యార్థులకు నైతిక విలువలు, మానవతా దృక్పథాన్ని నేర్పించారన్నారు. ఎంతోమందిని ఉన్నత శిఖరాలకు చేర్చడంలో ఆయన మార్గదర్శకత్వం ఎంతో గొప్పదని ప్రశంసించారు. ఈ సందర్భంగా తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల యాజమాన్యం రామగిరి దామోదర్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికలను బహూకరించారు. ఉద్యోగ విరమణ అనేది ఉద్యోగానికి మాత్రమే ముగింపు అని, సమాజానికి విద్యాదానం చేసే గురువులకు ఎప్పటికీ పదవీ విరమణ ఉండదని వక్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రాం కిషన్, ఏపీసీ చైర్మన్ నవనీత, పీఆర్‌టీయూ మండల ప్రతినిధి చంద్రకాంత్ బాబు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

## రైతులకు సరిపడా విత్తనాలు, ఎరువులు అందించాలి

**- నకిలీ విత్తనాలపై కఠిన చర్యలు తీసుకోవాలి**

**- పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని సిపిఎం డిమాండ్**

**మంచిర్యాల, జూన్ 30, ప్రభాతవార్త**

రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు ప్రభుత్వమే సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని సిపిఎం డిమాండ్ చేసింది. సిపిఎం మంచిర్యాల జిల్లా కమిటీ సమావేశం మంగళవారం గుమస ప్రకాష్ అధ్యక్షతన నిర్వహించబడింది. ఈ సమావేశానికి రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బండారి రవికుమార్ హాజరై మాట్లాడారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో రైతులు పొలాలను దున్ని విత్తనాల విత్తనానికి సిద్ధమవుతున్నప్పటికీ, వ్యవసాయ సహకార కార్యాలయాల వద్ద సరిపడా విత్తనాలు, ఎరువులు అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రైతులను మోసం చేస్తున్న నకిలీ విత్తనాలు, ఎరువుల విక్రయాలను అరికట్టేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. గత సీజన్‌కు సంబంధించిన వరి కొనుగోలు బిల్లులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని తక్షణమే చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే పోడు సాగు చేస్తున్న రైతులకు పంట రుణాలు మంజూరు చేయడంతో పాటు, పట్టాలు రాని ఆదివాసీలకు వెంటనే హక్కు పత్రాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. అటవీ అధికారుల దాడులను నిలిపివేయాలని కూడా కోరారు. పాఠశాలలు ప్రారంభమై పది రోజులు దాటినా అనేక చోట్ల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందలేదని సమావేశంలో ప్రస్తావించారు. పలు పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కొరత తీవ్రంగా ఉందని, కనీస మరుగుదొడ్లు, బోధనా పలకలు లేకపోవడంతో పాటు తరగతి గదుల తలుపులు కూడా శిథిలావస్థలో ఉన్నాయని తెలిపారు. ఈ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి పాఠశాలలను అభివృద్ధి పరచాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ల ఆశయ, జిల్లా కార్యదర్శి బోడేంకి చందు, జిల్లా వర్గ సభ్యులు కనికరపు అశోక్, ఎర్మ పున్నం, గుమస అశోక్, దుంపల రంజిత్ కుమార్, శ్యామల ఉమారాణి, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# ఉద్యమకారులకు ఇంటి స్థలాలు కేటాయించాలి

ఆసిఫాబాద్, జూన్ 30, ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో పాల్గొన్న ఉద్యమకారులకు ఇంటి స్థలాలు కేటాయించాలని తెలంగాణ రక్షణ సేన జిల్లా ఇంచార్జి వినోద్ చారి డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కావేటి సబితా మనోహర్ తో కలిసి మాట్లాడారు. నీళ్లు, నిధులు, నియామకాల సాధన కోసం తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన ఉద్యమకారులకు గత ప్రభుత్వాలు, ప్రస్తుత ప్రభుత్వం కూడా తీరని అన్యాయం చేశాయని ఆరోపించారు. ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినప్పటికీ తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 13 సంవత్సరాలు పూర్తవుతున్నా ఇప్పటివరకు ఒక్క సెంటు భూమి కూడా కేటాయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అన్యాయాన్ని నిరసిస్తూ తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో ఈ నెల 2న హైదరాబాద్‌లోని ఉప్పల్ లో భూ పోరాటానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. అదేవిధంగా తెలంగాణ ఉద్యమకారులకు సంక్షేమ పథకాలు అమలు చేస్తూ అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ పోరాటానికి కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన ఉద్యమకారులు, తెలంగాణ రక్షణ సేన పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేశ్వర్ అశోక్, మహమ్మద్ మోసిన్, సాయి, మాచర్ల శ్రీనివాస్, నైతం తిరుపతి, ఆత్రం వినోద్, కరుణాకర్, పెంటయ్య, శ్రీనివాస్, శ్యామ్ రావు, మొయినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తెలంగాణ రక్షణ సేన జిల్లా ఇంచార్జి వినోద్ చారి

## నేటి నుంచి అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ సెమిస్టర్2 పరీక్షలు

- హాల్‌టికెట్‌తో పాటు ఒరిజినల్ ఐడీ తప్పనిసరి.. సెల్‌ఫోన్లకు అనుమతి లేదు

కాగజ్‌నగర్ రూరల్, జూన్ 30, ప్రభాతవార్త : డా. బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల కాగజ్‌నగర్‌లో డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు జూలై 1 నుంచి సెమిస్టర్-2 పరీక్షలు ప్రారంభం కానున్నాయని కళాశాల ప్రిన్సిపాల్ కె. శ్రీదేవి, స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ తూడూరు దత్తాత్రేయ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు హాల్‌టికెట్‌తో పాటు ఆధార్ కార్డు ఒరిజినల్ లేదా ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు (ఐడెంటిటీ ప్రూఫ్) తప్పనిసరిగా వెంట తీసుకురావాలని సూచించారు. సంబంధిత పత్రాలు లేకుంటే పరీక్షా కేంద్రంలో అనుమతి లభించదని స్పష్టం చేశారు. అలాగే పరీక్షా హాల్లోకి సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, పుస్తకాలు, నోట్స్ లేదా ఇతర ఎలాంటి మెటీరియల్ తీసుకురావద్దని సూచించారు. విద్యార్థులందరూ పరీక్షా కేంద్రానికి ముందుగానే చేరుకుని నిబంధనలు పాటిస్తూ పరీక్షలకు హాజరై కావాలని వారు కోరారు.





## సతి గృహం, గ్రామపంచాయతీ తనిఖీ

- ఎంపీఓ గోవర్ధన్

దిలావర్పూర్, జూన్ 30, ప్రభాతవార్త: దిలావర్పూర్ మండల కేంద్రంలోని బీసీ బాలికల వసతి గృహాన్ని ఎంపీఓ గోవర్ధన్, ఈఓ మహేందర్‌తో కలిసి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహంలోని మరుగుదొడ్లు, మూత్రశాలలు, పరిసరాలను పరిశీలించి పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థినుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని వంటగదిని, నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను తనిఖీ చేసి, నాణ్యమైన, పరిశుభ్రమైన, రుచికరమైన ఆహారాన్ని అందించాలని ఆదేశించారు. విద్యార్థుల పట్ల ఎలాంటి నిర్లక్ష్యం ప్రదర్శించరాదని స్పష్టం చేశారు. అనంతరం లోలం గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి అక్కడి రికార్డులను పరిశీలించారు. నర్సరీ, సెగ్రిగేషన్ షెడ్‌ను తనిఖీ చేసి నిర్వహణపై పలు సూచనలు చేశారు. గ్రామంలో విస్తృతంగా మొక్కలు నాటేందుకు అనువైన ప్రదేశాలను గుర్తించి హరిత కార్యక్రమాలను విజయవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఈ తనిఖీలో పంచాయతీ కార్యదర్శి అరుణతో పాటు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి భారతీయ పౌరుడు తమ హక్కులు తెలుసుకోవాలి

- మేస్రం జంగు బాపు

బజార్‌హత్నూర్, జూన్ 30, ప్రభాతవార్త: ప్రతి భారతీయ పౌరుడు తమ హక్కులను తెలుసుకునేలా చేయడమే జిల్లా విజిలెన్స్ కమిటీ లక్ష్యమని జిల్లా కమిటీ సభ్యులు మేస్రం జంగు బాపు అన్నారు.



మండలంలోని గంగాపూర్ గ్రామంలో పౌర హక్కుల దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమాజంలో ప్రతి ఒక్కరూ సోదరభావం కలిగి ఉండాలని, ప్రజల మధ్య ఎలాంటి వివక్ష ఉండకూడదని జంగు బాపు అన్నారు. ఎస్సీ, ఎస్టీ ప్రజలు ఎలాంటి వివక్షకు గురికాకుండా చూసేందుకు జిల్లా విజిలెన్స్ కమిటీ నిరంతరం కృషి చేస్తుందని చెప్పారు. చట్టాలపై అవగాహన కలిగి ఉన్నప్పుడే హక్కులను కాపాడుకోగలమన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ నూర్ సింగ్, గ్రామ సర్పంచ్ టెకం సుభాష్, పంచాయతీ కార్యదర్శి కె. నీతా, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజు, ఉపసర్పంచ్ పాల్వే మారుతి, వికాస్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## నేడు భైంసాలో ప్రజావాణి

- జిల్లా ఎస్పీ జానకి షర్మిల



భైంసా, జూన్ 30, ప్రభాతవార్త: జిల్లా ప్రజల సమస్యల పరిష్కారం కోసం రేపు భైంసా పట్టణంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. బుధవారం ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 01:00 గంటల వరకు జిల్లా ఎస్పీ జానకి షర్మిల భైంసాలోని క్యాంప్ కార్యాలయంలో అందుబాటులో ఉంటారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ.. భైంసా డివిజన్ పరిధిలోని ప్రజలు తమ సమస్యలు, ఫిర్యాదులను నేరుగా ఎస్పీకి వివరించి పరిష్కరించుకోవచ్చని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు పోలీసు సేవలను మరింత చేరువ చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ అవకాశాన్ని భైంసా డివిజన్ పరిధిలోని ప్రజలు, బాధితులు సద్వినియోగం చేసుకోవాలని, నిర్ణీత సమయానికి క్యాంప్ కార్యాలయానికి చేరుకుని తమ ఫిర్యాదులను అందజేయాలని కోరారు.

## క్షేత్రస్థాయిలో పరిశీలించిన శిక్షణ డిప్యూటీ కలెక్టర్ ఇల్లందుల రాకేష్

సారంగాపూర్, జూన్ 30, ప్రభాతవార్త: మండల కేంద్రంలో మంగళవారం శిక్షణ డిప్యూటీ కలెక్టర్ ఇల్లందుల రాకేష్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. ప్రజా పాలనా ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామంలో చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో సేకరిస్తున్న తడి, పొడి చెత్తను వేరువేరుగా వర్గీకరించి, వాటి ద్వారా సేంద్రియ ఎరువును తయారు చేస్తున్న విధానాన్ని పంచాయతీ కార్యదర్శి చైతన్యం డిప్యూటీ కలెక్టర్‌కు వివరించారు. ఈ ఎరువును తక్కువ ధరకే స్థానిక రైతులకు అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్న విధానం, ఓటర్ల నమోదు ప్రక్రియ తదితర అంశాల ప్రగతిని ఎంపీడీఓ లక్ష్మీకాంత్ వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో సజావుగా సాగేలా చూడాలని డిప్యూటీ కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ అజీజ్ ఖాన్, సర్పంచ్ కోనేరు భూమన్న, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



## పర్ధన్‌గూడా పాఠశాల భవనానికి మరమ్మతులు చేపట్టాలి

- మరమ్మతులు పూర్తయ్యే వరకు ప్రత్యామ్నాయ భవనం కేటాయించాలని గ్రామస్తుల వినతి

కాగజ్‌నగర్ రూరల్, జూన్ 30, ప్రభాతవార్త : కాగజ్‌నగర్ మండలం కోసినీ గ్రామపంచాయతీ పరిధిలోని పర్ధన్‌గూడా ప్రభుత్వ గిరిజన ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరిందని, పైకప్పు నుంచి వర్షపు నీరు లీకేజీ అవుతుండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు గ్రామస్తులు మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ)కి మంగళవారం వినతిపత్రం అందజేశారు. వర్షాకాలంలో తరగతి గదుల్లోకి నీరు చేరుతుండటంతో విద్యార్థులు సురక్షితంగా చదువుకునే పరిస్థితి లేదని పేర్కొన్నారు. ప్రమాదం జరిగే అవకాశం ఉన్నందున పాఠశాల భవనానికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు. అలాగే మరమ్మతులు పూర్తయ్యే వరకు విద్యార్థుల చదువుకు అంతరాయం కలగకుండా తాత్కాలికంగా ప్రత్యామ్నాయ భవనాన్ని కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. చిన్నారుల భద్రత, విద్యాభ్యాసాన్ని దృష్టిలో ఉంచుకొని సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

## సహకార వారోత్సవాల్లో ఎఫ్‌పీఓపై అవగాహన కార్యక్రమం

ఆసిఫాబాద్, జూన్ 30, ప్రభాతవార్త : కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సహకార శాఖ ఆధ్వర్యంలో సహకార వారోత్సవాల్లో భాగంగా 5వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఎఫ్‌పీఓ (ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్) అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం ఆసిఫాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా సహకార అధికారి (డీసీఓ)తో పాటు వరంగల్‌కు చెందిన ప్యాకల్టీ సభ్యులు నాగనారాయణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘాలు, ఎఫ్‌పీఓలు సమన్వయంతో పనిచేస్తే రైతులు ఆర్థికంగా మరింత బలోపేతం అవుతారని పేర్కొన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. రైతు ఉత్పత్తిదారుల సంస్థల (ఎఫ్‌పీఓ) ప్రాధాన్యత, రైతులకు వాటి ద్వారా కలిగే ప్రయోజనాలు, సహకార సంఘాల అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమలు, రైతుల ఆదాయాన్ని పెంచే మార్గాలపై విస్తృతంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) అధ్యక్షులు, కార్యదర్శులు, డైరెక్టర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా సహకార అధికారి



## హ్యాండ్ బోర్‌కు మోటార్ ఏర్పాటు ..

### - ఎనిమిదో వార్డు ప్రజలకు తాగునీటి సౌకర్యం

**కాగజ్‌నగర్ రూరల్, జూన్ 30, ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ మండలంలోని చింతగూడ గ్రామపంచాయతీ పరిధిలోని 8వ వార్డులో స్థానిక ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరించే దిశగా హ్యాండ్ బోరింగ్‌కు విద్యుత్ మోటార్‌ను ఏర్పాటు చేశారు. దీంతో వార్డు ప్రజలకు ఇకపై సులభంగా తాగునీరు అందుబాటులోకి రానుంది. గ్రామంలోని ప్రజలు ఎదుర్కొంటున్న నీటి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఈ పనులను చేపట్టారు. మోటార్ ఏర్పాటు పూర్తికావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి వార్డుకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని, ప్రజలకు అవసరమైన తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్య సౌకర్యాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. గ్రామ అభివృద్ధికి ప్రజల సహకారం కూడా అవసరమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పోల్క లస్మక్క, ఉపసర్పంచ్ ఆత్రం ఆకాష్, వార్డు సభ్యులు ఆత్రం సంజీవ్, సాయిప్రకాష్, భీంరావుతో పాటు చింతగూడ కోయవాగు మాజీ ఉప సర్పంచ్ ఆదె రాజు, ఓంప్రకాష్, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

## పోచమ్మ ఆలయ చైర్మన్ పదవికి సాక్‌పల్లి సురేందర్ దరఖాస్తు

**సారంగాపూర్, జూన్ 30, ప్రభాతవార్త:**



మండలంలోని తాండ్ర గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు సాక్‌పల్లి సురేందర్ ప్రసిద్ధ అడెల్లి మహా పోచమ్మ ఆలయ చైర్మన్ పదవికి దరఖాస్తు చేసుకున్నారు. అదిలాబాద్ జిల్లా కేంద్రంలోని దేవాదాయ శాఖ కార్యాలయంలో మంగళవారం ఆయన తన దరఖాస్తు పత్రాన్ని అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా సాక్‌పల్లి సురేందర్ మాట్లాడుతూ.. తాను దివ్యాంగుడైనప్పటికీ రాజకీయాల్లో చైతన్యవంతంగా ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ సారంగాపూర్ మండల మీడియా కన్వీనర్‌గా కొనసాగుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నానని వివరించారు. భక్తుల ఆరాధ్యదైవమైన అడెల్లి పోచమ్మ ఆలయ కమిటీ చైర్మన్‌గా సేవలు అందించేందుకు తనకు అవకాశం కల్పించాలని కోరుతూ ఈ దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## పదవీ విరమణ పొందిన అధికారికి ఘన సన్మానం

**బెల్లంపల్లి, జూన్ 30, ప్రభాతవార్త**

బెల్లంపల్లి ఏరియా ఎస్టేట్ అధికారిగా సేవలందించి పదవీ విరమణ పొందుతున్న వర్కోలు సాగర్ ను మంగళవారం రోజున ఘనంగా సన్మానించారు. బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం. రమేష్ ఆధ్వర్యంలో జీఎం కార్యాలయ అధికారులు, ఉద్యోగులు కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సింగరేణిలో ఎలక్ట్రిషియన్‌గా తన సేవలను ప్రారంభించి, ఎస్టేట్ అధికారిగా ఎదిగిన సాగర్ కృషిని ఈ సందర్భంగా వక్తలు ప్రశంసించారు. ఆయనకు శాలువా కప్పి సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయుసి బ్రాంచి కార్యదర్శి, సీఎమ్ఓఏఐ ఏరియా అధ్యక్షులు మరియు ప్రాజెక్ట్ అధికారి మచ్చగిరి నరేందర్, ఏరియా ఇంజినీర్ జి. కృష్ణమూర్తి, ఇంచార్జి ఎస్ఓటు జిఎం ఎన్. ఉమాకాంత్, డీజీఎ (ఐఈ) ఉజ్వల్ కుమార్ బెహరా, ఫైనాన్స్ మేనేజర్ రవికుమార్, ఇంచార్జి పర్సనల్ విభాగం హెచ్.ఓ.డి శ్రీనివాస్, సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



### నిబంధనలు పాటించని ఆహార పదార్థాల తయారీదారులపై

# కఠినంగా వ్యవహరించాలి

### - నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్, జూన్ 30, ప్రభాతవార్త:**




జిల్లాలోని ఆహార పదార్థాల దుకాణదారులంతా ఖచ్చితంగా నియమ నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో ఆహార భద్రతపై కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని రెస్టారెంట్లు, హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, మిఠాయి దుకాణాలు, దాబాలు, ఆహార పదార్థాల విక్రయ కేంద్రాల నిర్వాహకులు ఆహార భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన ఆహారాన్ని అందించడం ప్రతి వ్యాపారి బాధ్యతని అన్నారు. వంటల తయారీలో ఉపయోగించే నూనెలు, మసాలా దినుసులు, పాలు, పెరుగు తదితర ముడి పదార్థాలు నాణ్యమైనవే వినియోగించాలని సూచించారు. ఆహార భద్రత అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తూ, దుకాణాల లైసెన్సులు సరిచూడాలని పేర్కొన్నారు. ముడి పదార్థాల గడువు తేదీలను, లేబుళ్లను నిరంతరం పరిశీలించాలన్నారు. గడువు ముగిసిన ఆహార పదార్థాలను వినియోగించినా, పరిమితికి మించి ఫుడ్ కలర్లను వాడినా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, కోడిగుడ్లు, పాలు, పాల పదార్థాలు, మాంసం వంటి ఆహార పదార్థాలు తాజావే వాడుతున్నారో లేదో చూడాలని చెప్పారు. అపరిశుభ్రమైన, గడువు ముగిసిన లేదా నాణ్యత లేని ఆహార పదార్థాలను విక్రయించినా, దుకాణాల్లో నిల్వ ఉంచినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆహార పదార్థాల విక్రయ కేంద్రాల్లో నాణ్యతా ప్రమాణాలు అమలవుతున్నాయో లేదో నిత్యం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం, ఇటీవల ఫుడ్ సేఫ్టీ అంశంపై శిక్షణ పొందిన పలువురు అంగన్‌వాడీ టీచర్లకు కలెక్టర్, అధికారులు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సమావేశంలో జిల్లా ఆహార భద్రత అధికారి సునీత, వైద్యారోగ్య అధికారి రాజేందర్, డిడబ్ల్యూఓ వినూత్న, డిపిఓ శ్రీనివాస్, డిఈఓ భోజన్న, మున్సిపల్ కమిషనర్ రవి బాబు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## అంధుల బతుకుల్లో వెలుగు నింపుతున్న బండారి రాజేశ్వరి ట్రస్ట్

### - చూపు లేని వారికి ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు

**చెన్నూరు, జూన్ 30, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా చెన్నూర్ పట్టణంలో బండారి రాజేశ్వరి ట్రస్ట్ వ్యవస్థాపకులు బండారి లక్ష్మణ్ ఆధ్వర్యంలో చెన్నూర్, కోటపల్లి, వేమనపల్లి మండలాలకు చెందిన 20 మంది నిరుపేదలకు ఉచిత కంటి శస్త్రచికిత్స చేసినట్లు వైద్యులు పాశం మహేశ్ తెలిపారు. బండారి రాజేశ్వరి ట్రస్ట్ ద్వారా ఇప్పటికే వందలాది ఉచిత కంటి ఆపరేషన్లు నిర్వహించడం జరిగిందన్నారు. నిరుపేదలకు కంటి చూపును అందించడంలో ట్రస్ట్ ముందు వరుసలో ఉండడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకులు బండారి లక్ష్మణ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఓపెన్ టెన్త్, ఇంటర్ కోర్సులకు అడ్మిషన్లు ప్రారంభం

**వేమనపల్లి, జూన్ 30, ప్రభాతవార్త**

తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్) ఆధ్వర్యంలో 2026-27 విద్యా సంవత్సరానికి ఓపెన్ పదవ తరగతి, ఓపెన్ ఇంటర్మీడియట్ కోర్సుల ప్రవేశాలు ప్రారంభమైనట్లు వేమనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. శ్రీధర్ రెడ్డి తెలిపారు. విద్యను మధ్యలో నిలిపివేసిన వారు, ఉద్యోగులు, గృహిణులు, ఇతర కారణాలతో చదువును కొనసాగించలేకపోయిన వారికి ఈ ప్రవేశాలు మంచి అవకాశమని ఆయన పేర్కొన్నారు. ఓపెన్ టెన్త్‌లో చేరే అభ్యర్థులు టీసీ లేదా బోనాఫైడ్ సర్టిఫికేట్ లేదా జనన ధ్రువీకరణ పత్రంతో పాటు ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలను సమర్పించాలని తెలిపారు. ఓపెన్ ఇంటర్మీడియట్‌లో ప్రవేశం పొందే వారు పదవ తరగతి మెమోతో పాటు అవసరమైన ధ్రువపత్రాల రెండు సెట్ల జిరాక్స్ ప్రతులను అందజేయాలని సూచించారు. అడ్మిషన్లకు ఆగస్టు 29, 2026 వరకు గడువు ఉన్నందున అర్హులైన అభ్యర్థులు చివరి తేదీ వరకు వేచి ఉండకుండా వీలైనంత త్వరగా ప్రవేశాలు పొందాలని ప్రధానోపాధ్యాయులు కోరారు. మరిన్ని వివరాల కోసం 98499 61648 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

## విద్యార్థినుల భద్రతకు అండగా మహిళా రక్షణ బృందం

### - మంచిర్యాల ఉప పోలీసు కమిషనర్ ఏ. భాస్కర్

**మంచిర్యాల, జూన్ 30, ప్రభాతవార్త**

మంచిర్యాల మండలంలోని సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో మహిళా రక్షణ బృందం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంచిర్యాల ఉప పోలీసు కమిషనర్ ఏ. భాస్కర్, సహాయ పోలీసు కమిషనర్ ఆర్. ప్రకాష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉప పోలీసు కమిషనర్ ఏ. భాస్కర్ మాట్లాడుతూ మహిళలు, విద్యార్థినుల భద్రత, ఆత్మవిశ్వాసం, గౌరవాన్ని పరిరక్షించడమే మహిళా రక్షణ బృందం ప్రధాన లక్ష్యమని తెలిపారు. పోలీసు స్టేషన్‌కు వెళ్లడంపై భయపడాల్సిన అవసరం లేదని, ఫిర్యాదు చేస్తే భవిష్యత్తు దెబ్బతింటుందనే అపోహలను విడిచిపెట్టాలని సూచించారు. సామాజిక మాధ్యమాలు, ఫోన్ కాల్స్, సందేశాలు లేదా ప్రత్యక్షంగా ఎలాంటి వేధింపులు ఎదురైనా వాటిని సహించకుండా వెంటనే మహిళా రక్షణ బృందాన్ని ఆశ్రయించాలని విద్యార్థినులకు సూచించారు. ఫిర్యాదు అందిన వెంటనే బాధితురాలిని గోప్యంగా సంప్రదించి సమస్యను తెలుసుకుని, అవసరమైన విచారణ అనంతరం నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. జీవితంలో సరైన నిర్ణయాలు తీసుకోవాలంటే అవసరమైనప్పుడు ధైర్యంగా "కాదు" అని చెప్పడం నేర్చుకోవాలని అన్నారు. ప్రతి విషయానికీ అంగీకరించడం కంటే, తమకు ఇష్టం లేని లేదా భవిష్యత్తుకు హాని కలిగించే అంశాలను ధైర్యంగా తిరస్కరించే వ్యక్తిత్వాన్ని అలవరచుకోవాలని సూచించారు. ఇతరులను అనుకరించి చదువు లేదా వృత్తిని ఎంచుకోవడం కంటే, తమ ఆసక్తులు, ప్రతిభ, సామర్థ్యాలను గుర్తించి వాటికి అనుగుణంగా ముందుకు సాగాలని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థిలో ప్రత్యేక ప్రతిభ ఉంటుందని, దానిని వెలికితీసి అభివృద్ధి చేసుకుంటే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చన్నారు. సమస్యలను చూసి భయపడకుండా వాటి మూల కారణాన్ని అర్థం చేసుకుని ప్రశాంతంగా విశ్లేషిస్తే పరిష్కారం సులభంగా లభిస్తుందని తెలిపారు. సరైన ప్రణాళికతో ముందుకు సాగితే ఎలాంటి సవాలునైనా అధిగమించవచ్చని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసు స్టేషన్ పరిశీలకుడు సత్యనారాయణ, జిల్లా మహిళా రక్షణ బృందం బాధ్యులు ఉషారాణి, కళాశాల ఉప ప్రిన్సిపాల్ అనూష, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



# ఎంపీకి ఘన సన్మానం

**- కనీస పెన్షన్ పది వేల రూపాయలకు పెంపు కోసం పోరాటం కొనసాగిస్తానన్న గడ్డం వంశీకృష్ణ**

**- విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి హామీ**



**మంచిర్యాల,జూన్ 30, ప్రభాతవార్త**

పెద్దపెల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ సింగరేణి విశ్రాంత ఉద్యోగుల కనీస పెన్షన్‌ను పది వేల రూపాయలకు పెంచాలని పార్లమెంటులో బలంగా ప్రస్తావించిన నేపథ్యంలో సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రతినిధులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా ఆత్మీయ సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య మాట్లాడుతూ, సింగరేణి , బొగ్గు గనుల సంస్థల పరిధిలో పదవీ విరమణ చేసిన వేలాది మంది విశ్రాంత ఉద్యోగులు ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా అత్యల్ప పెన్షన్‌తో జీవనం సాగిస్తున్న ఉద్యోగుల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉందని పేర్కొన్నారు. ఈ సమస్యలపై కొన్ని నెలల క్రితమే ఎంపీ దృష్టికి వినతిపత్రం ద్వారా తీసుకెళ్లామని, దానికి స్పందించిన ఎంపీ పార్లమెంట్ వేదికగా ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం విశేషమన్నారు. సింగరేణి, బొగ్గు గనుల సంస్థల పరిధిలో అత్యల్ప పెన్షన్ పొందుతున్న పెన్షన్ దారులకు కనీస పెన్షన్ పది వేల రూపాయల వరకు పెంచాలని ఎంపీ గడ్డం వంశీకృష్ణ గళం విప్పడం పట్ల విశ్రాంత ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. గత ఇరవై ఐదు సంవత్సరాల్లో పెన్షన్ పెంపుదల అంశంపై పార్లమెంటులో ఇంత స్పష్టంగా మాట్లాడిన ప్రజాప్రతినిధి ఎవరూ లేరని, ఈ విషయంలో ఎంపీ వంశీకృష్ణ కార్మిక బంధువుగా నిలిచారని కొనియాడారు.గతంలో కేంద్ర కార్మిక శాఖ మంత్రిగా సేవలందించిన కీర్తిశేషులు గడ్డం వెంకటస్వామి కృషి ఫలితంగానే బొగ్గు గనుల పెన్షన్ వ్యవస్థ ఏర్పడిందని గుర్తుచేశారు. ఆయన స్ఫూర్తితోనే ప్రస్తుతం ఎంపీ గడ్డం వంశీకృష్ణ విశ్రాంత ఉద్యోగుల హక్కుల కోసం పోరాడుతున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో విశ్రాంత ఉద్యోగులకు ముప్పై లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, వైద్య ఆరోగ్య కార్డు పరిమితిని ఎనిమిది లక్షల నుండి ఇరవై ఐదు లక్షల వరకు పెంచాలని, అలాగే పెరిగిన గ్రాట్యుటీ పరిమితి ఇరవై లక్షలను రెండువేల పదహారు నుంచే అమలు చేయాలని ఎంపీ దృష్టికి తీసుకువెళ్లారు.అలాగే పందొమ్మిది వందల ఎనభై తొమ్మిదిలో అమలులోకి వచ్చిన బొగ్గు గనుల పెన్షన్ విధానాన్ని పునఃసమీక్షించి, కరువు భత్యంతో కలిపి యాభై శాతం పెన్షన్ చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎంపీ గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ, సింగరేణి విశ్రాంత ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని, కనీస పెన్షన్ పది వేల రూపాయలకు పెంచే వరకు తన పోరాటం కొనసాగుతుందని హామీ ఇచ్చారు.

## కార్పొరేట్ పాఠశాలల ఫీజుల దోపిడీపై ఆగ్రహం

**- విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని నవతరం విద్యార్థి సమాఖ్య డిమాండ్**

**మంచిర్యాల, జూన్ 30,ప్రభాతవార్త**

జిల్లాలోని కార్పొరేట్ పాఠశాలలు తల్లిదండ్రుల నుంచి లక్షల్లో ఫీజులు వసూలు చేస్తూ నిలువు దోపిడీకి పాల్పడుతున్నాయని ఆరోపిస్తూ, మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో నవతరం విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు నీరటి రామ్ ప్రసాద్ పటేల్ మాట్లాడుతూ, జిల్లాలోని పలు కార్పొరేట్ పాఠశాలలు ప్రవేశాల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నాయని విమర్శించారు. ప్రవేశ రుసుము, నిర్ధారణ రుసుము పేర్లతో అదనపు వసూళ్లకు పాల్పడుతూ, పుస్తకాలు, దుస్తుల పేరుతో మరింత భారం మోపుతున్నారని అన్నారు.విద్యాశాఖ అధికారులు ఈ అక్రమాలపై స్పందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం అనుమానాలకు తావిస్తోందని ఆయన ఆరోపించారు. కొంతమంది కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు తమపై ఎవరూ చర్యలు తీసుకోలేరన్న ధోరణితో వ్యవహరిస్తూ, ప్రశ్నించే తల్లిదండ్రులపైనే ఎదురుదాడికి దిగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.పాఠశాలల పేర్లతోనే పుస్తకాలను ముద్రించి అధిక ధరలకు విక్రయించడం ద్వారా విద్యాశాఖ నిబంధనలను బహిరంగంగా ఉల్లంఘిస్తున్నారని పేర్కొన్నారు. కొన్ని సంస్థలు అద్దె గదుల్లోనే పుస్తకాల విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేసి బహిరంగంగా వ్యాపారం సాగిస్తున్నాయని తెలిపారు. కనీస మౌలిక వసతులు లేకపోయినా ఆకర్షణీయ పేర్లతో విద్యార్థులను ఆకట్టుకుని నియంత్రణలేని ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లాలోని విద్యార్థి సంఘాలతో కలిసి ఐక్య కార్యాచరణ చేపట్టి జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో రాష్ట్ర ప్రతినిధి రాకేష్, జిల్లా కన్వీనర్ జాబు ఆశిష్ కుమార్, ఇర్ఫాన్, అశ్వంత్, సంతోష్, అంజి తదితరులు పాల్గొన్నారు.



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న విద్యార్థి సంఘం నాయకులు



## ఎస్సీ, ఎస్టీ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూన్ 30, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ఇంటిగ్రేటెడ్ డిస్ట్రిక్ట్ ఆఫీసర్స్ క్యాంప్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ దీపక్ కుమార్ అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు రేణుకుంట ప్రవీణ్, మంచిర్యాల డీసీపీ భాస్కర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సమావేశంలో కమిటీ సభ్యుడు చిలుక రాజనర్సు మాట్లాడుతూ పాఠశాలలు, కాలేజీలు పునఃప్రారంభమైన నేపథ్యంలో శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాలు విద్యార్థులకు ప్రమాదకరంగా మారుతున్నాయని పేర్కొన్నారు. అలాంటి భవనాల స్థానంలో సురక్షితమైన ప్రత్యామ్నాయ భవనాలను ఏర్పాటు చేసి, మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. అలాగే ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడులు, భూ సమస్యలను ప్రస్తావిస్తూ దశాబ్దాలుగా సాగు చేస్తున్న పీపి ల్యాండ్ భూములను కొందరు అక్రమంగా ఆక్రమిస్తున్నారని తెలిపారు. ఆ భూములను రక్షిస్తూ, బాధితులకు అండగా నిలవాలని, అట్రాసిటీ కేసుల్లో ఆలస్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. యువతలో మత్తు పదార్థాల వినియోగం పెరుగుతున్నదని ఆందోళన వ్యక్తం చేస్తూ గంజాయి వంటి మత్తు పదార్థాలపై కఠిన చర్యలు తీసుకుని జిల్లాను గంజాయి రహిత జిల్లాగా మార్చాలని కోరారు. అలాగే క్రమం తప్పకుండా సివిల్ రెడ్స్ డే నిర్వహించి, క్షేత్ర స్థాయిలో సమస్యలను గుర్తించి పరిష్కరించాలని సూచించారు. ఈ సమస్యలపై స్పందించిన కలెక్టర్ దీపక్ కుమార్ తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డీసీపీ భాస్కర్ కూడా ఎస్సీ, ఎస్టీ కేసుల్లో ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే కేసులు నమోదు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు మనోజ్, చంద్రయ్య, రాములు, ఎస్సీడీడీ దుర్గ ప్రసాద్, బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్, మంచిర్యాల ఏసీపీ ప్రకాష్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు, కమిటీ సభ్యులు దుర్గం ఎల్లయ్య, దమ్మ నారాయణ, పెద్ది రాజన్న తదితరులు పాల్గొన్నారు.



## కార్మికుల సంక్షేమానికి సింగరేణి ప్రాధాన్యత

**- శ్రీరాంపూర్ జీఎం మునిగంటి శ్రీనివాస్**

**నస్పూర్, జూన్ 30, ప్రభాతవార్త**

శ్రీరాంపూర్ జీఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో జీఎం మునిగంటి శ్రీనివాస్ అధ్యక్షతన గుర్తింపు సంఘం (ఏఐటీయూసీ) ప్రతినిధులతో సోమవారం జూన్ నెల స్ట్రక్చర్ కమిటీ సమావేశం జరిగింది. గత నెలలో లేవనెత్తిన సమస్యల పరిష్కార ప్రగతి వివరాలను ఈ సందర్భంగా యూనియన్ ప్రతినిధులకు అందజేశారు. అనంతరం ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా ఆధ్వర్యంలో గనుల్లో రక్షణ, అవసరమైన యంత్రాల సమీకరణతో పాటు కార్మిక కాలనీల్లో మౌలిక వసతులు, డిస్పెన్సరీలలో వైద్య సదుపాయాల కల్పనపై జీఎంకు ప్రతిపాదనలు సమర్పించారు. దీనిపై జీఎం స్పందిస్తూ.. సింగరేణి సంస్థ కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, ప్రతినిధులు కోరిన సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అదే సమయంలో నాణ్యమైన ఉత్పత్తి సాధనలో కార్మికులు భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం శ్రీరాంపూర్ బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, ఏరియా ఇంజనీర్ టి. రమణారావు, డీజీఎం (పర్సనల్) ఎస్. అనిల్ కుమార్, ఏజెంట్లు ఎన్. శ్రీధర్, రవికుమార్, శ్రీరాంపూర్ ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ సిహెచ్. వెంకటేశ్వర్లు, డీజీఎంలు రాజన్న, కృష్ణారెడ్డి, మల్లయ్య, హరినారాయణ, డీవైసీఎంఓ రమేష్ బాబు, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ జక్కారెడ్డి, పర్చేజ్ ఆఫీసర్ చంద్రశేఖర్, సివిల్ విభాగం డీవైఎస్ఈలు సత్యనారాయణ, గుండేరావు, సీనియర్ పీఓ ప్రశాంత్, ఇతర అధికారులు, యూనియన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి అధికారుల పోరాటానికి ఏఐటీయూసీ సంపూర్ణ మద్దతు

**- పీఆర్‌పీ, వేతన పెంపును వెంటనే చెల్లించాలి: ముష్కె సమ్మయ్య, బాజీ సైదా**

**నస్పూర్, జూన్ 30, ప్రభాతవార్త**

తమ న్యాయమైన పీఆర్‌పీ బకాయిలను విడుదల చేయాలని, కోల్ ఇండియా అధికారులతో సమానంగా పెరిగిన వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ సింగరేణి అధికారులు గత రెండు రోజులుగా చేపట్టిన ఆందోళన కార్యక్రమాలకు సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) సంపూర్ణ సంఘీభావాన్ని ప్రకటించింది. మంగళవారం శ్రీరాంపూర్ ఏరియాలో అధికారుల నిరసన వేదిక వద్దకు ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముష్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీ సైదా విచ్చేసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సింగరేణి అధికారులకు గత రెండేళ్లుగా రావాల్సిన పీఆర్‌పీని యాజమాన్యం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. 1994-95వ ఆర్థిక సంవత్సరంలో సింగరేణి సంస్థ తీవ్ర నష్టాల్లో కూరుకుపోయి బీఐఎఫ్ఆర్ కు చేరిన విషయాన్ని ఈ సందర్భంగా వారు గుర్తుచేశారు. ఆ గడ్డు కాలంలో సింగరేణి కార్మికులు, అధికారులు రాత్రింబగళ్లు సమిష్టి కృషితో పనిచేసి సంస్థను లాభాల్లోకి తీసుకువచ్చారని కొనియాడారు. అయితే, ప్రస్తుతం సింగరేణి సంస్థలో రాజకీయ జోక్యం మితిమీరిపోవడం వల్ల మళ్లీ సంస్థకు గడ్డుకాలం ఏర్పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్తులోనూ కార్మికులు, అధికారులు సమిష్టిగా శ్రమించి సంస్థను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. అధికారుల న్యాయమైన డిమాండ్లపై రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. పీఆర్‌పీ చెల్లించే వరకు అధికారులు చేసే ప్రతి ఆందోళన కార్యక్రమానికి ఏఐటీయూసీ తరపున పూర్తి మద్దతు, సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, సంయుక్త కార్యదర్శి రాచర్ల చంద్రమోహన్, మైనింగ్ స్టాఫ్ బ్రాంచ్ కార్యదర్శి బాలకృష్ణ, జీఎం కార్యాలయం పిట్ కార్యదర్శి సందీప్ తదితరులు పాల్గొని అధికారులకు మద్దతు పలికారు.





ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

## డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ గారి భద్రతను కొనసాగించాలి

### - సిర్పూర్‌లో టిఆర్ఎస్ నాయకుల ధర్నా

**సిర్పూర్ (టి), జూన్ 30, ప్రభాతవార్త :**

సిర్పూర్ బస్టాండ్ వద్ద డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ భద్రతను తగ్గించే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని, ప్రస్తుతం ఉన్న భద్రత కంటే మరింత పటిష్టమైన భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. నాయకులు మాట్లాడుతూ, డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతూ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ప్రజలతో మమేకమవుతున్న నాయకుడని అన్నారు. అలాంటి నాయకుడి భద్రతను తగ్గించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ఉన్న భద్రతను తొలగించే ప్రయత్నాలను వెంటనే నిలిపివేసి, అవసరమైతే మరింత బలోపేతమైన భద్రత కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ప్రజా సమస్యలను లేవనెత్తే నాయకులపై రాజకీయ కక్షసాధింపు ధోరణితో వ్యవహరించడం సరికాదని, ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై దృష్టి సారించాలని వారు సూచించారు. ప్రజాస్వామ్యంలో విభిన్న అభిప్రాయాలను గౌరవించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిర్పూర్ మండల నాయకులు, మహిళా నాయకురాళ్లు, మండల అధ్యక్షులు, సర్పంచులు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ అభిమానులు, ప్రజలు భారీ ఎత్తున పాల్గొని తమ సంఘీభావాన్ని తెలియజేశారు. అనంతరం ప్రభుత్వం వెంటనే భద్రతకు సంబంధించిన నిర్ణయాన్ని పునఃసమీక్షించి, డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ ప్రస్తుతం ఉన్నదానికంటే మెరుగైన భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

## ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించిన మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ డా. కొత్తపల్లి అనిత

### - 17 మందికి ఉచితంగా కంటి శస్త్రచికిత్సలు
### - ప్రజలు సేవలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపు

**కాగజ్‌నగర్ రూరల్, జూన్ 30, ప్రభాతవార్త :**





కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలోని కిమ్స్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో శ్రీ కొత్తపల్లి వెంకట లక్ష్మి-చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ డా. కొత్తపల్లి అనిత మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలోని సొసైటీ ద్వారా ఇప్పటివరకు 10 వేల మందికి పైగా ఉచిత కంటి శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. సమాజ సేవ లక్ష్యంగా నిరుపేదలకు ఉచిత వైద్య సేవలు అందించడం గొప్ప విషయమని కొనియాడారు. శిబిరానికి 34 మంది హాజరుకాగా, వారిలో 17 మందికి కేటరాక్ట్ (కంటి శుక్లాలు) శస్త్రచికిత్స అవసరమని వైద్యులు గుర్తించినట్లు తెలిపారు. అవసరమైన వారికి సొసైటీ స్వంత ఖర్చులతో రవాణా, భోజన సదుపాయాలు కల్పించి బెల్లంపల్లి లయన్స్ క్లబ్ కంటి ఆసుపత్రికి తరలించి ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రజలందరూ ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని, ఇప్పటికే శస్త్రచికిత్సలు చేయించుకుని లబ్ధి పొందిన వారు తమ అనుభవాలను ఇతరులకు తెలియజేసి మరింత మందిని ప్రోత్సహించాలని డా. కొత్తపల్లి అనిత కోరారు. ఈ కార్యక్రమంలో ఆప్తమాలజిస్ట్ డాక్టర్ శ్రీనాథ్, ఐ క్యాంప్ ఇన్‌చార్జి గోపి, కిమ్స్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి సిబ్బంది, శ్రీ కొత్తపల్లి వెంకట లక్ష్మి-చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# నిజాయితీ సేవలకు ఘన సత్కారం..

### - మహమ్మద్ లాయక్ అలీకి ఆత్మీయ వీడ్కోలు
### - ముప్పై తొమ్మిది సంవత్సరాల నిష్కళంక సేవలను కొనియాడిన గృహ నిర్మాణ సంస్థ అధికారులు, సిబ్బంది



సన్మానిస్తున్న ప్రాజెక్ట్ అధికారి, సిబ్బంది




మాట్లాడుతున్న ప్రాజెక్టు అధికారి బన్సీలాల్

**మంచిర్యాల, జూన్ 30, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా కేంద్రంలో గల కలెక్టర్ కార్యాలయంలోని గృహ నిర్మాణ సంస్థలో సహాయ ఇంజనీర్‌గా గత ముప్పై తొమ్మిది సంవత్సరాలుగా విశిష్ట సేవలందించిన మహమ్మద్ లాయక్ అలీ మంగళవారం రోజు పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆయనకు గృహ నిర్మాణ సంస్థ కార్యాలయంలో ఘనంగా సత్కారం నిర్వహించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. కార్యక్రమానికి హాజరైన గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు సంచాలకులు, అధికారులు, సిబ్బంది లేయక్ అలీ అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఉద్యోగ జీవితమంతా ఆయన క్రమశిక్షణ, అంకితభావం, నిజాయితీతో విధులు నిర్వహించి అందరికీ ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ముప్పై తొమ్మిది సంవత్సరాల సేవా కాలంలో ఎన్నో సవాళ్లను సమర్థంగా ఎదుర్కొంటూ ప్రజలకు నాణ్యమైన సేవలు అందించారని పేర్కొన్నారు. ఎలాంటి ఒత్తిళ్లకు లోనుకాకుండా న్యాయం, ధర్మం, పారదర్శకతతో పనిచేయడం ఆయన ప్రత్యేకత అని తెలిపారు. సహోద్యోగులతో స్నేహపూర్వకంగా మెలుగుతూ, కార్యాలయ అభివృద్ధికి తనవంతు కృషి చేశారని గుర్తుచేశారు. యువ ఉద్యోగులకు మార్గదర్శకుడిగా నిలిచి తన అనుభవంతో ఎన్నో విలువైన సూచనలు అందించారని అన్నారు. ఈ సందర్భంగా లేయక్ అలీని శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం ఆనందోత్సాహాల మధ్య కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచుకొని శుభాకాంక్షలు తెలిపారు. పదవీ విరమణ అనంతరం కూడా సమాజ సేవలో కొనసాగాలని కోరుతూ అధికారులు, సిబ్బంది ఆయనకు శుభాభినందనలు తెలిపారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో ముగిసింది.

## బెల్లంపల్లి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహణ

**బెల్లంపల్లి, జూన్ 30, ప్రభాతవార్త**

బెల్లంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఆదేశాల మేరకు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సాధారణ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ ఈసమావేశానికి మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతిరమేష్ బాబు అధ్యక్షత వహించగా, వైస్ చైర్మన్ రాగంశెట్టి సత్యనారాయణ, కమిషనర్ తన్నీరు రమేష్, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు. సమావేశంలో బెల్లంపల్లి మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలు, కొనసాగుతున్న అభివృద్ధి పనులు, భవిష్యత్తులో చేపట్టబోయే ప్రణాళికలపై చర్చించారు. బెల్లంపల్లి పట్టణ అభివృద్ధికి కీలక నిర్ణయాలు తీసుకుంటూ మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో మొత్తం 10 అభివృద్ధి పనులకు ఆమోదం లభించింది. బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహించిన ఈ సమావేశంలో ఎమ్మెల్యే మద్దతుతో పలు ప్రాధాన్య అంశాలను చర్చించి నిధులు మంజూరు చేశారు. పట్టణంలోని పలు వార్డుల్లో కాలనీ డ్రైనేజ్ లైన్ల నిర్మాణానికి ఆమోదం తెలపడంతో పాటు, డంపింగ్ యార్డ్‌లో అభివృద్ధి పనులు, ట్రాక్టర్ కొనుగోలుకు రూ.3.45 లక్షలు కేటాయించారు. రోడ్లలో గుంతల పూడిక పనులకు రూ.2 లక్షలు, పారిశుద్ధం మరియు తాగునీటి సమస్యల పరిష్కారానికి రూ.5 లక్షలు మంజూరు చేశారు. పాత డంప్ యార్డ్ అభివృద్ధి, ప్లాట్ల కోతల కోసం రూ.1 లక్ష, ట్రాక్టర్ మెయింటెనెన్స్‌కు రూ.20 వేల నిధులు కేటాయించారు. అదనంగా స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా పనులకు రూ.4.29 లక్షలు, స్ట్రీట్ లైట్ల మరమ్మతులకు రూ.20 వేల, ఇంటిగ్రేటెడ్ చార్టర్ మరమ్మతులు, పునరుద్ధరణ పనులకు రూ.5 లక్షలు ఆమోదించారు. అలాగే పలు వార్డుల్లో సీసీ డ్రైన్లు, కల్వర్ట నిర్మాణానికి రూ.3 లక్షలు మంజూరు చేశారు. ఈ నిర్ణయాలతో పట్టణంలో మౌలిక సదుపాయాలు మెరుగుపడతాయని మున్సిపల్ చైర్‌పర్సన్ తెలిపారు. సమావేశంలో వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

## మహాప్రస్థానంపై చేసిన ఆరోపణలకు క్షమాపణ చెప్పాలి

### * ప్రజాప్రతినిధుల డిమాండ్

**మంచిర్యాల, జూన్ 30, ప్రభాతవార్త**

మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ఆదేశాల మేరకు మంచిర్యాల కాలేజీ రోడ్డులోని మహాప్రస్థానంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంచిర్యాల నగర పాలక సంస్థ మేయర్ దర్ని మధుకర్, కార్పొరేటర్లు స్రవంతి, హరికృష్ణ, పట్టణ మహిళా అధ్యక్షురాలు హేమలత పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు నాయకత్వంలో నియోజకవర్గంలో విద్య, వైద్యం, నగర అభివృద్ధి రంగాల్లో వేగంగా పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ అభివృద్ధిని ఓర్వలేక కొంతమంది భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్పొరేటర్లు అనవసర ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. నగర పాలక సంస్థ సమావేశంలో అంశాల చర్చ పూర్తికాకముందే సమావేశాన్ని బహిష్కరించి కావాలనే గందరగోళ పరిస్థితులు సృష్టించారని ఆరోపించారు. కేంద్ర నిధులతోనే అభివృద్ధి జరుగుతోందని చెప్పడం హాస్యాస్పదమని, దేశ అభివృద్ధి కోసం కేంద్రం-రాష్ట్రం సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. నగర అభివృద్ధిలో ఎలాంటి వివక్ష లేదని స్పష్టం చేసిన వారు, మంచిర్యాల కాలేజీ రోడ్డులోని మహాప్రస్థానంలో దోపిడి జరుగుతోందని చేసిన ఆరోపణలు పూర్తిగా అసత్యమని తెలిపారు. తప్పుడు ఆరోపణలు చేసిన భారతీయ జనతా పార్టీ నాయకులు వెంటనే ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావుకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్పొరేటర్లు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

**- పనులను పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



చెన్నూరు, జూన్ 30, ప్రభాతవార్త

చెన్నూరు పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంచిర్యాల జిల్లా స్థానిక చెన్నూరు పట్టణంలో మంగళవారం రోజున జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పలు అభివృద్ధి పనులను అధికారులతో కలిసి పర్యవేక్షించారు. నూతనంగా నిర్మిస్తున్న నైపుణ్య అభివృద్ధి కేంద్రం పరిశీలించిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే చర్యలలో భాగంగా చెన్నూర్ మండల కేంద్రంలో చేపట్టిన నైపుణ్యాభివృద్ధి కేంద్రం నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండల కేంద్రంలో చేపట్టిన 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి పనులను సందర్శించారు. ప్రభుత్వం వైద్య రంగాన్ని బలోపేతం చేస్తూ ప్రజలకు మరింత వేగవంతమైన, మెరుగైన వైద్య సేవలను అందించేందుకు ఆసుపత్రి ఏర్పాటుకు చర్యలు తీసుకుందని, ఈ క్రమంలో చెన్నూర్ మండల కేంద్రంలో చేపట్టిన 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని తెలిపారు. ఆసుపత్రి నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని, గుత్తేదారు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ తో కలిసి మునిసిపల్ పరిధిలో అమృత్ 2.0 పథకంలో భాగంగా చేపట్టిన నీటి ట్యాంక్ నిర్మాణం, పైప్ లైన్ల పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి తరగతి గదులు, వంటశాల, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలలో త్రాగునీరు, విద్యుత్, మూత్రశాలలు, ఇతర అన్ని సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనంలో పౌష్టిక ఆహారం అందించడం జరుగుతుందని తెలిపారు. 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడి ఫిజిక్స్ సబ్జెక్టులో విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం చెన్నూర్ మున్సిపల్ పరిధిలోని 3, 4, 11 వార్డులలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ నిర్వహణను మండల తహసిల్దార్ మల్లికార్జున్‌తో కలిసి పరిశీలించారు. జూలై 24వ తేదీ వరకు ఇంటింటి సర్వే నిర్వహించి ప్రతి అర్హులైన ఓటరుకు ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేసి, పూరించిన తర్వాత సేకరించాలని, ఫారాల పంపిణీ ప్రక్రియను జూలై 1వ తేదీ నాటికి పూర్తి చేసి ప్రతి రోజూ పురోగతి నివేదికలను సమర్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నజ్రూల్‌నగర్ సబ్‌స్టేషన్‌లో అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

**- వోల్టేజ్ సమస్యలకు శాశ్వత పరిష్కారం - రైతులు, వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా: ఎస్ఈ జాడే ఉత్తమ్**



కాగజ్‌నగర్ రూరల్, జూన్ 30, ప్రభాతవార్త :

కాగజ్‌నగర్ మండలంలోని నజ్రూల్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో అదనంగా ఏర్పాటు చేసిన 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆసిఫాబాద్ జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్ఈ) జాడే ఉత్తమ్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నజ్రూల్‌నగర్ పరిధిలో చాలా కాలంగా నెలకొన్న వోల్టేజ్ సమస్యను అధిగమించేందుకు అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీంతో రైతులతో పాటు గృహ, వాణిజ్య విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందడంతో పాటు విద్యుత్ అంతరాయాలు, వోల్టేజ్ హెచ్చుతగ్గుల సమస్యలు గణనీయంగా తగ్గనున్నాయని పేర్కొన్నారు. వినియోగదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని విద్యుత్ శాఖ ఆధునికీకరణ పనులు చేపడుతోందని, అవసరమైన చోట కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణంతో పాటు అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తూ విద్యుత్ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు నిరంతరాయంగా, నాణ్యమైన విద్యుత్ అందించడమే శాఖ ప్రధాన లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ డివిజనల్ ఇంజనీర్ నాగరాజు, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్లు ఇర్ఫాన్ అహ్మద్, శ్రీనివాస్, ఏఈలు రాంప్రసాద్, శ్రీనివాస్, ఫోర్‌మెన్ రమేష్, లైన్ ఇన్‌స్పెక్టర్ ఎం.ఏ.జీ. సతీష్, లైన్‌మెన్‌లు మోహన్, మహేందర్, ఆపరేటర్లు శ్రీనివాస్, నాగేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# దుబాయ్‌లో సారంగాపూర్ వాసి మృతి

**మృతదేహాన్ని తెప్పించాలని ఎన్నారై సభ్యునికి వినతి**

సారంగాపూర్, జూన్ 30, ప్రభాతవార్త:

సారంగాపూర్ మండల కేంద్రానికి చెందిన శివరాత్రి నర్సిములు (44) దుబాయ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. ఈ విషాద ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. నర్సిములు గత పదేళ్లుగా సౌదీ, బహ్రెయిన్, దుబాయ్ వంటి గల్ఫ్ దేశాలలో లేబర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. స్వగ్రామంలో కులవృత్తిగా రాళ్లు కొట్టే పని చేసినప్పటికీ సరైన సంపాదన లేకపోవడం, ముగ్గురు కుమార్తెల చదువులు, కుటుంబ ఆర్థిక భారం పెరగడంతో గతేడాది ఆయన మళ్లీ దుబాయ్ వెళ్లారు. అక్కడ ద్రిషక్ మెయింటెనెన్స్ ఎల్ఎల్‌సీ కంపెనీలో పనిచేస్తున్న నర్సిములుకు ఇటీవల ఛాతి నొప్పి రావడంతో ఆసుపత్రిలో చికిత్స చేయించుకుని గదిలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ క్రమంలోనే ఆయన ఆదివారం మృతి చెందగా, కంపెనీ ప్రతినిధులు మంగళవారం ఉదయం నర్సిములు భార్యకి ఫోన్ చేసి సమాచారం అందించారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ కోనేరు భూమన్న స్పందించి, బాధిత కుటుంబ సభ్యులను వెంటబెట్టుకుని నిర్మల్‌లో ఎన్నారై రాష్ట్ర సలహా మండలి సభ్యులు స్వదేశ్ పరికిపండ్లను కలిసి వినతిపత్రం అందజేశారు. నర్సిములు మృతదేహాన్ని త్వరగా స్వగ్రామానికి రప్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్వదేశ్ పరికిపండ్ల తక్షణమే స్పందిస్తూ.. భారత రాయబార కార్యాలయానికి, కేంద్ర ప్రభుత్వ మదద్ పోర్టల్‌కు ఈమెయిల్ ద్వారా వివరాలను పంపారు. అలాగే దుబాయ్‌లోని ప్రముఖ సామాజిక కార్యకర్త గుండెల్లి నర్సింహకు ఫోన్ చేసి మృతదేహాన్ని వీలైనంత త్వరగా భారతదేశానికి పంపేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సారంగాపూర్ మండల నాయకులు సామల వీరయ్య, శివరాత్రి గురుస్వామి, దండుగుల పోశెట్టి పాల్గొన్నారు.

# ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులా..?

**అవినీతిని వెలికితీసిన ప్రజాప్రతినిధులపై వేధింపులు ఆపాలని అదనపు కమిషనర్‌కు ఫిర్యాదు**



మంచిర్యాల, జూన్ 30, ప్రభాతవార్త

మంచిర్యాల నగర పాలక సంస్థలో జరుగుతున్న అవినీతి, అక్రమాలు మరియు ప్రజా సమస్యలపై ప్రశ్నించిన భారతీయ జనతా పార్టీ కార్పొరేటర్లు, నాయకులపై అక్రమ కేసులు నమోదు చేయడాన్ని నిరసిస్తూ భారతీయ జనతా పార్టీ కార్పొరేటర్లు అదనపు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు కస్తూరి నాగరాజు, అమిరిశెట్టి రాజ్ కుమార్, బోట్ల సత్యనారాయణ మాట్లాడుతూ, ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నగర పాలక సంస్థలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై ప్రశ్నిస్తే తమపై తప్పుడు కేసులు నమోదు చేయడం దురదృష్టకరమని అన్నారు.ప్రజల తరఫున మాట్లాడే ప్రతిపక్ష నాయకులను భయభ్రాంతులకు గురిచేయడానికి ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అవినీతి, అక్రమాలపై ప్రశ్నించడం ప్రజాప్రతినిధుల హక్కు మాత్రమే కాకుండా బాధ్యత కూడా అని పేర్కొన్నారు.ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ విమర్శలను అణచివేయాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే తమపై నమోదు చేసిన అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలని, సంబంధిత అధికారులపై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని అదనపు కమిషనర్‌ను కోరారు.ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, మద్దతుదారులు పాల్గొన్నారు.

# బెల్లంపల్లి పెయింటర్స్ యూనియన్ సమస్యలు పరిష్కరించాలి

బెల్లంపల్లి, జూన్ 30, ప్రభాతవార్త



బెల్లంపల్లి పట్టణంలోని బిల్డింగ్ పెయింటర్స్ అండ్ పుట్టి వర్కర్స్ యూనియన్ సభ్యులు తమ సమస్యలను పరిష్కరించాలని స్థానిక ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామిని కోరారు. బెల్లంపల్లి పట్టణ అధ్యక్షులు బండి ప్రభాకర్ సూచన మేరకు యూనియన్ సభ్యులు విజ్ఞప్తి చేశారు. బెల్లంపల్లి నియోజకవర్గంలో యూనియన్ సభ్యత్వం లేని బయటి వ్యక్తులు అక్రమంగా పనులు చేయడం వల్ల స్థానిక కార్మికులకు ఉపాధి అవకాశాలు తగ్గుతున్నాయని వారు తెలిపారు. ఈ విషయంలో సంబంధిత అధికారుల ద్వారా చర్యలు తీసుకుని స్థానిక కార్మికుల ఉపాధిని రక్షించాలని కోరారు. అదేవిధంగా, యూనియన్‌కు శాశ్వత కార్యాలయం లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొంటూ, యూనియన్ భవనం నిర్మాణానికి స్థలం కేటాయించాలని ప్రభుత్వాన్ని అభ్యర్థించారు.

# స్లాబ్‌పై నుంచి పడి సెంట్రింగ్ కూలీ మృతి

బెల్లంపల్లి, జూన్ 30, ప్రభాతవార్త



మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో విషాద ఘటన చోటుచేసుకుంది. సోమవారం అర్ధరాత్రి ఓ ఇంటి స్లాబ్‌పై నుంచి ప్రమాదవశాత్తు కిందపడి సెంట్రింగ్ కూలీ మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం, పెద్దపల్లి జిల్లా గొల్లపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి రాము (43) సెంట్రింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల తన భార్యతో కలిసి బెల్లంపల్లిలోని బంధువుల ఇంటికి వచ్చాడు. సోమవారం రోజు బావమరిది మల్లెంపల్లి శంకర్ ఇంటిలో స్లాబ్ పనులు పూర్తయ్యాయి. రాత్రి భోజనం అనంతరం పాత ఇంట్లో నిద్రించిన రాము, ఉక్కపోతగా ఉండడంతో అర్ధరాత్రి కొత్త ఇంటి స్లాబ్‌పైకి వెళ్లి పడుకున్నాడు. ఆ సమయంలో నిద్రలేచి మూత్ర విసర్జనకు వెళ్లినప్పుడు ప్రమాదవశాత్తు స్లాబ్‌పై నుంచి కిందపడటంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఘటనా స్థలాన్ని సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏఎస్సై కుప్పిరాల వేణుగోపాల్ పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య మల్లేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించగా, స్వగ్రామం గొల్లపల్లికి తరలించారు. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు.

# వ్యాధుల నివారణే లక్ష్యం.. పరిశుభ్రత పాటించాలి

**- సర్పంచ్ కోట వేణుగోపాల్**

కాగజ్‌నగర్ రూరల్, జూన్ 30, ప్రభాతవార్త :

వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగా కాగజ్‌నగర్ మండలంలోని బారెగూడ గ్రామంలో మంగళవారం విస్తృతంగా బ్లీచింగ్ చల్లింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కోట వేణుగోపాల్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో మురుగు కాలువలు, బావులు, నిల్వ నీరు ఉన్న ప్రాంతాలు, దోమలు అధికంగా ఉండే ప్రదేశాల్లో బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించి ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ కోట వేణుగోపాల్ మాట్లాడుతూ వనాకాలంలో డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రతి కుటుంబం పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవడంతో పాటు దోమల వ్యాప్తిని నివారించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. గ్రామ ప్రజల ఆరోగ్య రక్షణే తమ ప్రధాన లక్ష్యమని, వ్యాధుల నివారణకు అవసరమైన అన్ని చర్యలను నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. బారెగూడను పరిశుభ్రమైన, ఆరోగ్యవంతమైన గ్రామంగా తీర్చిదిద్దేందుకు గ్రామపంచాయతీ కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

